నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 1 మార్చి 2025 | ADILABAD NIRMAL



కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న నిర్మల్ జిల్లాకు చెందిన ఎన్నికల సిబ్బంది

# రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

## నిర్మల్ జిల్లాకు చెందిన 19 మంది ఎన్నికల సిబ్బందికి గాయాలు

- జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ వద్ద ప్రమాదం
- ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులు భద్రపరిచి వస్తుండగా ఘటన
- కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో క్షతగాత్రులకు కలెక్టర్ అభిలాష అభినవ్ పరామర్శ



కరీంనగర్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, వైద్యాధికారులు

కరీంనగర్ విద్యానగర్/కొడిమ్యాల, ఫిబ్రవరి 28: కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామ శివారులో రైల్వే గేట్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున నిర్మల్, భైంసా డిపోలకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో 19 మంది ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి గాయాలయ్యాయి. కొడిమ్యాల ఎస్ఐ సందీప్, స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నిర్మల్, భైంసా డిపోలకు చెందిన రెండు ఆర్టీసీ బస్సుల్లో ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌కు తీసుకొచ్చి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. శుక్రవారం తెల్లవారుజామున తిరిగి వెళ్తున్న క్రమంలో కొడిమ్యాల మండలం నమిలికొండ రైల్వే ట్రాక్ వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో ముందు వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న భైంసా డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో 19 మందికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లాకు చెందిన క్షతగాత్రులను స్థానికులు కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇందులో 17 మందికి స్వల్పగాయాలు కాగా ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. పురుషోత్తం (ఎన్నికల సిబ్బంది), మొయినొద్దీన్ (డ్రైవర్)ను మెరుగైన చికిత్స కోసం హయ్యర్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. ఉదయం ప్రమాదం జరిగిన వెంటనే కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో వెంటనే అప్రమత్తమైన సూపరింటెండెంట్, ఆర్ఎంవో నవీన దవాఖానలో వార్డును సిద్ధం చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించారు. కోలుకున్న 17 మందిని డిశ్చార్జ్ చేయగా, మరో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం హయ్యర్ సెంటర్‌కు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. తక్షణమే స్పందించి వైద్య సేవలందించిన కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బందిని నిర్మల్, కరీంనగర్ కలెక్టర్లు అభినందించారు. నిర్మల్ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ అజ్మీరా దశరథ్ అతివేగంగా, అజాగ్రత్తగా బస్సు నడుపుతూ సడెన్ బ్రేక్ వేయగా ప్రమాదం జరిగిందని భైంసా డిపో డ్రైవర్ మొయినొద్దీన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కొడిమ్యాల ఎస్ఐ సందీప్ తెలిపారు.

### ఎమ్మార్వోతో పాటు సిబ్బందికి గాయాలు

దస్తురాబాద్,ఫిబ్రవరి 28: కరీంనగర్ జిల్లాలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో దస్తురాబాద్ తహసీల్దార్‌తో పాటు కార్యాలయ సిబ్బందికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లా నుంచి ఎన్నికల సామగ్రిని కరీంనగర్‌లో భద్రపరిచి తిరిగి వస్తున్న క్రమంలో వేకువ జామున రోడ్డు ప్రమాదం జరిగింది. దస్తురాబాద్ తహసీల్దార్ సర్ఫరాజ్‌తో పాటు ఆర్ఐ గంగన్న, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు అభిలాష్, మధు, సూరజ్‌కు గాయాలయ్యాయి.



ప్రమాదంలో ధ్వంసమైన భైంసా, నిర్మల్ డిపో బస్సులు

# యూరియా కోసం అరిగోస

## ఉదయం నుంచే సొసైటీల ఎదుట పడిగాపులు.



- గంటల తరబడి నిలబడినా అందని బస్తాలు
- యాసంగి పంటల దిగుబడిపై ప్రభావం!
- ఆందోళనలో అన్నదాతలు

దస్తూరాబాద్‌లో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు (ఫైల్)

**మొన్న దస్తూరాబాద్.. నిన్న లోకేశ్వరం.. ఖానాపూర్.. ఇలా.. జిల్లాలో రోజుకో ప్రాంతంలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాయాల్సి వస్తున్నది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా యూరియా కొరత లేదని ఒకవైపు అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఎక్కడ చూసినా యూరియా కోసం రైతులు ఎగబడే పరిస్థితి నెలకొన్నది. సొసైటీల ఎదుట తెల్లవారుజాము నుంచే రైతులు బారులు తీరడం కనిపిస్తున్నది. గత 10 ఏళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఇలాంటి దృశ్యాలు ఎక్కడా కనిపించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పడ్డ కష్టాలను గుర్తుకు తెస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

**- నిర్మల్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ)**

నిర్మల్ జిల్లాలో పంటల సాగుపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినప్పుడే ఏ పంటకు ఎంత యూరియా, పొటాష్, కాంప్లెక్స్ తదితర ఎరువులు అవసరం అనేది వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసి ఇండెంట్ ఇస్తారు. ఆ మేరకు ప్రభుత్వం విడుతల వారీగా ప్రభుత్వం ఎరువులను సరఫరా చేస్తుంది. ఈ యాసంగి సీజన్‌కు కూడా ఇదే విధంగా నిర్మల్ జిల్లాకు 37వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని ప్రభుత్వానికి నివేదించారు. ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 1,10,000 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వరి ఎదుగుదలపై కొంతమేర ప్రభావం చూపింది. ప్రస్తుతం పంట ఎదుగుదల బాగుండాలంటే యూరియా అధికంగా వినియోగించాల్సి వస్తున్నది రైతులు చెబుతున్నారు. ఈ యాసంగిలో 1,02,000 ఎకరాల్లో మక్క సాగు చేస్తుండగా, 35 వేల ఎకరాల్లో జొన్న, 55వేల ఎకరాల్లో శనగ పంట సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ సారి వెదజల్లే పద్ధతిలో 40 నుంచి 50 వేల ఎకరాల వరకు రైతులు వరి సాగు చేశారు. ఎకరా వరి పంటకు రెండు విడుతల్లో రెండు నుంచి మూడు బస్తాల యూరియా వేయాల్సి ఉండగా, రైతులు నాలుగు నుంచి ఐదు బస్తాలు వేస్తున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మక్క పంటకు సైతం ఎకరానికి రెండు విడుతల్లో నాలుగు బస్తాల యూరియా వేయాల్సి ఉండగా, రైతులు రెండు నుంచి మూడు విడుతల్లో ప్రతిసారి నాలుగు బస్తాల యూరియాను వేస్తున్నారంటున్నారు. దీంతో యూరియా వినియోగం విపరీతంగా పెరిగింది. జిల్లాలో మార్చి నెల చివరి నాటికి మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం కావాల్సి ఉండగా, ఇప్పటికే 39 వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియాను జిల్లా రైతులు వినియోగించారని అధికారులు చెబుతున్నారు. మరో 4 వేల మెట్రిక్ టన్నుల వరకు అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

### ఆందోళనలో అన్నదాతలు..

జిల్లా వ్యాప్తంగా గత 15 రోజుల నుంచి యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాబోయే రోజుల్లో యూరియా దొరుకుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని దస్తూరాబాద్, లోకేశ్వరం, ఖానాపూర్ మండలాలకు చెందిన రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని సహకార సంఘాలకు ఎరువులు వస్తున్నట్లు తెలిసిన వెంటనే రైతులు బారులు తీరుతున్నారు. అందరికీ ఎరువులు అందకపోవడంతో మిగతా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు అవసరానికి మించి కొనుగోలు చేస్తుండడంతో మరి కొందరికి ఒక్క బస్తా కూడా దొరకడం లేదు. అవసరం మేరకే యూరియా బస్తాలను ఇవ్వాలని కోరుతున్నారు. ఎరువుల కొరత ఇలాగే ఉంటే కీలక దశలో యాసంగి పంటలకు యూరియా అందక దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

### యూరియా వినియోగంపై అవగాహన పెరగాలి



జిల్లాలోని రైతులకు యూరియా వినియోగంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. అవసరానికి మించి పంటలకు యూరియా వేయడంతో ఎలాంటి ప్రయోజనం లేదు. రైతులు డబ్బులను వృథా చేసుకోవద్దు. వరికి రెండు విడుతల్లో నాలుగు బస్తాల యూరియా సరిపోతుంది. కాని ఎకరానికి 8 బస్తాల వరకు వేస్తున్నారు. దీంతో పెట్టుబడి పెరగడంతో పాటు రోజురోజుకూ భూసారం తగ్గుతున్నది. వరిలో చీడ పీడలు పెరిగి దిగుబడిపై ప్రభావం చూపుతున్నది. చాలామంది రైతులు మళ్లీ దొరుకుతుందో లేదో అని ముందు జాగ్రత్తగా యూరియాను నిల్వ చేసుకుంటున్నారు. తొందరపడి అవసరానికి మించి కొనుగోలు చేయవద్దు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జిల్లాలో 3,500 టన్నుల వరకు యూరియా అందుబాటులో ఉన్నది.

*-అంజి ప్రసాద్, నిర్మల్ జిల్లా వ్యవసాయ అధికారి,*



లోకేశ్వరంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)



ఖానాపూర్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం యూరియా కోసం బారులు తీరిన రైతులు

### ఖానాపూర్‌లో ఆందోళన

ఖానాపూర్, ఫిబ్రవరి 28: ఖానాపూర్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం సుమారు 200 మంది రైతులు గంటల తరబడి బారులు తీరారు. అందరికీ యూరియా అందడం లేదంటూ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు, మూడు రోజులకు లారీలో 444 బస్తాల యూరియా వస్తుండగా సరిపోవడం లేదని మండిపడ్డారు. సరిపడా యూరియాను ఎందుకు అందుబాటులో ఉంచడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలన రోజుల్లో పడిన కష్టాలను తీసుకువస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిపడా యూరియా కొరత తీర్చకపోతే రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

# మహిళా సాధికారతకు చేయూతనందించాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 : మహిళా సాధికారతకు బ్యాంకులు ఆర్థిక చేయూత అందించాలని నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు 2కే రన్‌ను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జిల్లాలో ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మహిళలకు ఆర్థిక ప్రోత్సాహం అందించే అన్ని రకాల పథకాలపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ పథకాలపై అర్హులైన మహిళలందరికీ రుణాలు అందించాలని బ్యాంకులకు సూచించారు. స్వయం సహాయ సంఘాలకు చేయూతనిచ్చే పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాం గోపాల్, జీడ్పీ సీఈవో గోవింద్, కమిషనర్ జగదీశ్వర్, మెప్మా పీడీ సుభాష్ వివిధ శాఖల అధికారులు ఉన్నారు.




ఆర్థిక అక్షరాస్యత ర్యాలీని ప్రారంభిస్తున్న నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

# నర్సాపూర్ (జీ) పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

నర్సాపూర్ (జీ), ఫిబ్రవరి, 28 : నర్సాపూర్ (జీ) పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు పెండింగ్‌లో తీవ్రమైన నేరాలపై సీడీ ఫైల్స్ స్థిరాస్తి చోరీలు, ఐటీ కేసుల, ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రాజేశ్ మీనా, నిర్మల్ గ్రామీణ సీఐ కృష్ణ, నర్సాపూర్ (జీ) ఎస్ఐ సాయి కిరణ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


తలమడుగు, ఫిబ్రవరి 28 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బీ సౌజన్య అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో జిల్లా న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలతో పాటు బాలికలపై కూడా అఘాయిత్యాలు జరుగుతున్నాయనే విషయం గమనించాలన్నారు. ప్రతి విద్యార్థీ చదువుతోపాటు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. 'బ్యాడ్ టచ్ గుడ్ టచ్'పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రత్యేక న్యాయస్థానం ఉందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం వంట గదులతోపాటు తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ అర్చన, న్యాయవాదులు అశోక్, ఉమేశ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య

# నార్నూర్ మండలాభివృద్ధికి కృషి

నార్నూర్, ఫిబ్రవరి28 : నార్నూర్ మండలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో మండలంలోని రాజుల్‌గూడలోని ఫంక్షన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో బీఏఐఎస్ సంస్థ అందించే సేవలు ప్రశంసనీయమన్నారు. అన్ని రంగాల్లో వెనుకంజలో ఉన్న నార్నూర్ మండలాన్ని ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద ఎంపిక చేశామని తెలిపారు. మండలాన్ని విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులను అభినందించారు. ఈ సంస్థ ద్వారా అందించే సేవలతో రైతులు ఆర్థికంగా ప్రయోజనం కలిగే అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అంతకుముందు తాడిహత్నూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌తోపాటు లైబ్రేరీని ప్రారంభించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఏఐఎఫ్ సంస్థ సహకారంతో వివిధ అభివృద్ధి పనులు, డిజిటల్ తరగతి గదులు, గ్రంథాలయాలు, తోటల పెంపకం, ప్రాజెక్టు, సహజ వనరుల నిర్వహణ(ఎన్ఆర్ఎం), సోలార్ వంటి కార్యక్రమాలు ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటేశ్ చల్లవార్, జోనల్‌హెడ్ కరుణాకార్‌రెడ్డి, సీఎస్ఆర్ బృందం సభ్యులు ఆసియా సయ్యద్, స్టేట్ హెడ్ హేమంత్, తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో జవహర్‌లాల్, ఐసీడీఎస్ సీడీపీవో శారద, ఈజీఎస్ ఏపీవో జాదవ్ సురేశ్, తదితరులు ఉన్నారు.



నార్నూర్ మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

# 'రంజాన్'కు ఏర్పాట్లు చేయాలి


నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 28: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ జానకీషర్మిలతో కలిసి అధికారులు, ముస్లిం మత పెద్దలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2 నుంచి రంజాన్ మాసం ఉపవాసాలు ప్రారంభం కానున్న దృష్ట్యా మసీదుల వద్ద నిరంతరం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణా సముదాయాలను అదనపు సమయాల్లో తెరిచి ఉంచే విధంగా అనుమతిస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల మాట్లాడుతూ ప్రార్థనా సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, పార్కింగ్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి మోహన్‌సింగ్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, జాదవ్‌కృష్ణ, రాజేశ్‌కుమార్, ముస్లిం మత పెద్దలు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

# మసీదుల వద్ద వసతులు కల్పించాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 28 : పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం దృష్ట్యా మసీదుల వద్ద ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని మున్సిపల్ యంత్రాంగం పూర్తి చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు శుక్రవారం ఆదిలాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీవీఎస్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శనివారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్నందున ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సౌకర్యంతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి వార్డులో పారిశుధ్య పనులు చేయాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మసీదుల వద్ద దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అశోక్ స్వామి, సాజీదుద్దీన్, కోవ రవి, కొండ గణేశ్, సలీం, హైమద్ బాయ్, శంకర్, వినోద్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు, నాయకులు